సాక్షి
అనంతపురం
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



బస్సు రూట్ల మళ్లింపు

రాప్తాడు రైల్వే గేటు వద్ద రోడ్డు పనులు జరుగుతున్నందున ఆర్టీసీ బస్సుల రూట్లను మళ్లించారు.

8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.8°/14.5°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

ఆరోగ్య సురక్షలో అగ్రస్థానం

- రాష్ట్రంలోనే అత్యధిక లబ్ధిదారుల నమోదు 'అనంత'లోనే
- గడిచిన నెలరోజుల్లో 71వేల మందికి పైగా నమోదు
- 70వేల మంది లబ్ధిదారులతో నంద్యాలకు రెండో స్థానం
- గ్రామీణ ప్రాంతాల్లో భారీగా నమోదైనట్టు గణాంకాల వెల్లడి
- అవ్వాతాతలకు కంటి వెలుగు.. 4,887 మందికి పైగా లబ్ధి



కూడేరు మండలం కొర్రకోడు ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏస్)లో 'అనంత' పైచేయి సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో ఎక్కువ మంది లబ్ధిదారులు అనంతపురం జిల్లాలోనే నమోదయ్యారు. ఇక్కడ 71 వేల మంది పై చిలుకు లబ్ధిదారులు నమోదయ్యారు. 70వేల మంది పైచిలుకు లబ్ధిదారులతో నంద్యాల జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ప్రతి మండల పరిధిలోనూ స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఖరీదైన మందులు వంటివి వాటితో కంటినుంచి పంటినొప్పి వరకూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

రూరల్ పరిధిలో అదుర్స్

అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 128 క్యాంపులు నిర్వహించగా, 52వేల మందికి పైగా వైద్య సేవలు పొందినట్టు తాజా గణాంకాల్లో వెల్లడైంది. మరో 40 క్యాంపులు పట్టణ ప్రాంతాల్లో నిర్వహించగా సుమారు 19 వేల మంది లబ్ధిదారులు నమోదయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతంలో నమోదైన లబ్ధిదారులు, మొత్తం లబ్ధిదారుల్లో ఎక్కువ మంది నమోదైంది అనంతపురం జిల్లాలోనే కావడం గమనార్హం.

కంటివెలుగుకు భారీగా అవ్వాతాతలు

అరవై ఏళ్లు దాటితే చత్వారం రావడం సహజం. ఇలాంటి వారు అదేపనిగా ఆస్పత్రికి రారు. మసక చూపుతోనే ఇబ్బంది పడుతుంటారు. కానీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటిచూపుతో బాధపడుతున్న వేలాది మంది అవ్వాతాతలు లబ్ధిపొందారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతో 4,887 మంది కంటి పరీక్షలకు వచ్చారు. వీరిలో 1,224 మందికి మందులతోనే సరిపోతుందని సూచించగా, 3,622 మందికి కళ్లద్దాలు, 30 మందికి క్యాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. తొలిదశ జగనన్న ఆరోగ్య సురక్షలో 17,827 మందికి కళ్లద్దాలు సూచించగా అందులో 17,453 మందికి కళ్లద్దాలు ఇచ్చారు. అంటే 99 శాతం కళ్లద్దాలు లబ్ధిదారులకు చేరినట్టు అధికారులు పేర్కొన్నారు.

సగటున 424 మంది ఓపీకి

జిల్లాలో ఇప్పటివరకు 168 క్యాంపులు నిర్వహించగా, 71 వేల మందికి పైగా వైద్యసేవలు పొందారు. సగటున ఒక్కో క్యాంపు నుంచి 424 మంది ఔట్‌పేషెంటు సేవలు పొందారు. అదే సత్యసాయి జిల్లాలో 157 క్యాంపులు నిర్వహించగా 46,788 మంది వైద్యసేవలు పొందారు. ఈ లెక్కన సగటున ఒక్కో క్యాంపు నుంచి 298 మంది ఓపీ సేవలు పొందారు. పెద్ద జబ్బులు ఉన్నట్టు తేలిన వారిని ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం అందించేందుకు సిఫార్సు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష-2 ద్వారా అత్యధిక లబ్ధిదారులు నమోదైన జిల్లాల్లో కొన్ని...

జిల్లా	గ్రామీణ ప్రాంతాల్లో	పట్టణ ప్రాంతాల్లో	మొత్తం
అనంతపురం	52,382	18,898	71,280
నంద్యాల	52,717	18,033	70,750
వైఎస్సార్	48,219	16,368	64,587
తిరుపతి	43,767	18,883	62,650
కృష్ణా	37,459	17,286	54,745
ప్రకాశం	41,440	9,497	50,937

మెరుగైన వైద్యసేవలందించడానికే..



జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. మారుమూల గ్రామాల్లో సామాన్యులకు కూడా మెరుగైన వైద్యం అందించాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. దీన్ని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు తీసుకెళుతున్నాం. అధికారులు, వైద్య సిబ్బంది దీనిపై ప్రత్యేక దృష్టి సారించేలా చేశాం.

–గౌతమి, కలెక్టర్, అనంతపురం

డీఈఓగా వరలక్ష్మి



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా బి.వరలక్ష్మిని నియమించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈమె అనంతపురం డీఈఓ కార్యాలయంలో ఏడీగా కొద్దిరోజులు పని చేశారు. ప్రస్తుతం రాయచోటి డిప్యూటీ డీఈఓగా పని చేస్తున్నారు. డీఈఓగా పదోన్నతి కల్పించి జిల్లాకు కేటాయించారు. కొద్దిరోజులుగా అసిస్టెంట్ డైరెక్టర్ వి.నాగరాజు ఎఫ్ఏసీ డీఈఓగా ఉన్నారు.

'డ్రిప్' సరఫరా వేగవంతం చేయండి : ఏపీఎంఐపీ పీఓ

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పరికరాలు మంజూరైన వెంటనే రైతులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) సీబీ హరినాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన గుంటూరు నుంచి పీడీ ఫిరోజ్‌ఖాన్, ఏపీడీ ఫజులున్నీసాబేగం, ఎంఈ ఇంజనీర్లు, కంపెనీ డీసీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాకు 12,500 హెక్టార్ల డ్రిప్ ఏర్పాటు లక్ష్యం కాగా 9,314 మంది రైతులకు 11,376 హెక్టార్లకు పరికరాలు మంజూరైనట్లు గుర్తు చేశారు. ఇంకా 800 హెక్టార్లకు సంబంధించి 700 మంది రైతులకు పరికరాలు సరఫరా చేయలేదన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఇబ్బంది పడకుండా డ్రిప్ పరికరాల సరఫరా వేగవంతం చేయాలన్నారు. మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్ వెనువెంటనే జరిగిపోవాలన్నారు.

న్యూస్‌రీల్

ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 21 మంది గైర్హాజరు



గార్లదిన్నె కేజీబీవీలో సీసీ కెమెరాలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 594 మంది విద్యార్థులకు గాను 573 మంది హాజరయ్యారు. ఇందులో ఉదయం జరిగిన పరీక్షలకు 349 మంది విద్యార్థులకు గాను 335 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 245 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరయ్యారు. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం కేజీబీవీ కేంద్రాలను ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్, డీఈసీ సభ్యుడు శంకరయ్య పరిశీలించారు.

10న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఈ నెల 10న రాప్తాడు మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ వి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులతో ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేయించి ఇన్‌స్పైర్‌లో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. జిల్లాస్థాయి ప్రదర్శనకు 106 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఆ విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రాజెక్టులతో హాజరుకావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి యు.బాలమురళీ కృష్ణను సంప్రదించాలని సూచించారు.

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా రమేష్‌రెడ్డి

అనంతపురం అర్బన్: డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా డిప్యూటీ కలెక్టర్ జి.రమేష్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. హంద్రీ-నీవా ఎస్‌డీసీగా వెన్నెల శ్రీనుని నియమించారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల



జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. డిసెంబర్, జనవరి నెలల్లో నిర్వహించిన ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ మూడో సెమిస్టర్ (ఆర్-20), (ఆర్-17), నాలుగో సెమిస్టర్ (ఆర్-21), (ఆర్17), ఐదో సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ మూడో సెమిస్టర్ (ఆర్-17), నాలుగో సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

బాధ్యతగా ఎన్నికల విధులు



సమావేశంలో సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఉరవకొండ: అధికారులు సమన్వయంతో ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో ఎన్నికల విధుల కేటాయింపుపై సమీక్ష నిర్వహించారు. కేటాయించిన విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు. మద్యం, డబ్బు లాంటివి అక్రమంగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అరిచిందని అంతమొందించాడు

- వీడిన మహిళ హత్య హిస్టరీ
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



లక్ష్మీనారాయణమ్మ(ఫైల్)

ఆ యువకుడు ఈజీ మనీ కోసం షేర్ మార్కెట్‌ను ఎంచుకున్నాడు. అందులో నష్టం వచ్చేసరికి ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఎలాగైనా నష్టాన్ని పూడ్చుకోవాలనుకుని దారి తప్పాడు. నగలు దోపిడీ చేసే క్రమంలో ఏకంగా హత్య చేసి.. కటకటాలపాలయ్యాడు.



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి. చిత్రంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి

అనంతపురం: నార్పల మండలం బండ్లపల్లి పప్పూరుకు చెందిన లక్ష్మీనారాయణమ్మ(62) హత్య మిస్టరీ వీడింది. షేర్‌మార్కెట్‌లో నష్టపోయిన యువకుడు అప్పులను తీర్చుకునేందుకు నగల కోసం ఆమెను హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, అనంతపురం రూరల్ డీఎస్పీ బి.వెంకటశివారెడ్డి మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వెల్లడించారు. బండ్లపల్లి పప్పూరుకు చెందిన చల్లా నరేంద్ర (29) బీకాం వరకు చదివాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే మరోవైపు షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాడు. ఇటీవల షేర్‌మార్కెట్‌లో అతడికి నష్టం వచ్చింది. పెట్టుబడి కోసం బయటి వ్యక్తులతో రూ.5 లక్షల దాకా అప్పు చేశాడు. నష్టపోయిన డబ్బును ఎలాగైనా సంపాదించాలనుకున్నాడు. ఫిబ్రవరి ఒకటో తేదీన నరేంద్ర అరటి తోటలోకి అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణమ్మ చింతకాయలు ఏరుకోవడానికి వెళ్లింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడాన్ని గమనించిన నరేంద్ర... లక్ష్మీనారాయణమ్మ మెడలోని బంగారు గొలుసు లాగడానికి ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. ఎవరైనా అటువైపు వస్తారేమోనని భయపడిన నరేంద్ర పదునైన రాయితో ఆమె తలపై బలంగా బాదాడు. తీవ్ర గాయమైన లక్ష్మీనారాయణమ్మ అక్కడికక్కడే ప్రాణం విడిచింది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, ఇత్తడి ఉంగరం, ఇత్తడి గాజు, సెల్‌ఫోన్ తీసుకున్నాడు. అనంతరం అక్కడే గుంత తీసి మృతదేహాన్ని పాతిపెట్టాడు. తన సోదరి లక్ష్మీనారాయణమ్మ కనిపించడం లేదని బొందలవాడలో నివాసముంటున్న వెంకటరమణ మూడో తేదీన నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బండ్లపల్లి పప్పూరులో మహిళను హత్య చేసి అరటి తోటలో పూడ్చినట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికి తీయించగా.. చనిపోయింది లక్ష్మీనారాయణమ్మ అని బంధువులు గుర్తించారు. అనంతరం స్థానికులను, అనుమానితులను పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో నరేంద్ర నేరం అంగీకరించాడు. మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన రూరల్ డీఎస్పీ బి.వెంకటశివా రెడ్డి, శింగనమల సీఐ శ్రీధర్, బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

అధికారులు అప్రమత్తతతో ఉండాలి

- ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ అమలుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల వేళ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమి సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికల అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవితో కలిసి పోలీసు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, ఆదాయపన్ను శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో జిల్లాలోని సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించి సున్నితమైన నియోజకవర్గాలను గుర్తించేందుకు అధికారులతో చర్చించాలన్నారు.

నిఘా పెంచాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చెప్పారు. సెక్షన్ 123 ఆఫ్ ఆర్‌పీ యాక్ట్, 171బీ, 171సీ యాక్టులు పకడ్బందీగా అమలవ్వాలన్నారు. కర్ణాటక రాష్ట్రం జిల్లాకు సరిహద్దుగా ఉందన్నారు. ఈ క్రమంలో అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలన్నారు. డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. చెక్‌పోస్టుల్లో సీజ్ చేసిన వివరాలు ప్రతి రోజూ నివేదిక రూపంలో అందించాలని చెప్పారు.

నోటిఫికేషన్ తరువాత కమిటీలు

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, తదితర కమిటీలు క్రియాశీలం కావాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు, వాణిజ్య, ఆదాయ, సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 24 చెక్‌పోస్టులు, 6 డైనమిక్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. రైల్వేస్టేషన్లలో ఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాన్నారు. ఆర్టీసీ అధికారులు ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఎన్నికల సమయంలో వాణిజ్య, ఆదాయ పన్ను శాఖల పాత్ర కీలకమన్నారు. బ్యాంకుల్లో అధిక డిపాజిట్లు, ఖాతాల్లో నగదు నిల్వ, బంగారు విక్రయ దుకాణాలు, పెట్రోల్ బంక్‌లు, ఇలా అన్ని అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు రాంభూపాల్ రెడ్డి, కరుణకుమారి, వరప్రసాద్, ఎల్‌డీఎం సత్యరాజ్, డీసీఓ ప్రభాకర్‌రెడ్డి, వాణిజ్య పనుల శాఖ జాయింట్ కమిషనర్ శేషారెడ్డి, ఆదాయపన్ను శాఖ అధికారి విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, పైలా నరసింహయ్య తదితరులు

- పోస్టర్ల విడుదలలో వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధుల పిలుపు

అనంతపురం కార్పొరేషన్: రాప్తాడులో ఈ నెల 11న జరిగే ఎన్నికల శంఖారావం 'సిద్ధం' సభను విజయవంతం చేద్దామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరించారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడానికి సిద్ధం అంటూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినదించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఆదర్శవంతమైన పాలనను సీఎం జగనన్ అందించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్ నిలిచారని కొనియాడారు. పైలా మాట్లాడుతూ 'సిద్ధం' సభకు రాయలసీమలోని 49 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ కేడరంతా హాజరవుతున్నట్లు తెలిపారు. లక్షలాదిగా కార్యకర్తలు, అభిమానులు హాజరవుతున్నారన్నారు. కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల రాష్ట్ర చైర్మన్లు హరీష్‌కుమార్ యాదవ్, ఎస్.రంగన్న, నదీం అహ్మద్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రరెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్ కుమార్‌రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్‌లు రిలాక్స్ నాగరాజు, రాజారాం, అనుబంధ సంఘాల అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, ఎన్‌వీ నారాయణ, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మారుతీనాయుడు, రాళ్ల తిమ్మారెడ్డి, చిత్రా వెంకటేష్, చింతకుంట మధు, పెన్నోబులేసు, అనిల్‌కుమార్ గౌడ్, మిద్దె నగేష్, ఓబులేసు, రాధాయాదవ్, అంజలి, అనిత, మునీర పాల్గొన్నారు.

అరచేతిలో విజ్ఞానం.. భవితకు సోపానం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోంది. పేద విద్యార్థులకు ఉన్నత చదువే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారు. మన బడి నాడు-నేడు కింద సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు. దీంతో పాటు సాంకేతిక విద్యను చేరువ చేసేలా ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసి.. బైజూస్ కంటెంట్‌తో పాఠాలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకుంటున్నారు. విజ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నత భవితకు బాటలు వేసుకుంటున్నారు. అనంతపురం రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్యాబ్‌లను ఉపయోగిస్తున్న దృశ్యాలివీ.

–సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు



ట్యాబ్‌ల వినియోగంలో సందేహాలను నివృత్తి చేస్తున్న దృశ్యం



క్లుప్తంగా

జిల్లాకు 1,320 మెట్రిక్ టన్నుల యూరియా



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు వాగన్ల ద్వారా ఇఫ్కో కంపెనీ నుంచి వచ్చిన 1,320 మెట్రిక్ టన్నుల యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ఆర్‌బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిగులు బస్తాలను మార్క్‌ఫెడ్ కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు.

జనసేనతోనే పొత్తు



మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం టవర్ క్లాక్: రాబోవు ఎన్నికల్లో ఏపీలో జనసేనతో బీజేపీ పొత్తు ఉంటుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ముందుకు వచ్చే మరి కొన్ని పార్టీలతోనూ పొత్తులు ఉండే అవకాశం ఉందన్నారు. మంగళవారం అనంతపురానికి వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరోసారి ప్రజలు ఆదరించాలన్నారు. తాను హిందూపురం పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేసే అవకాశముందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్‌కుమార్, చిరంజీవి రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి



మృతురాలు రంగమ్మ

యాడికి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం పుప్పాల గ్రామంలోని హరిజన వాడకు చెందిన రంగమ్మ(73)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఉతికిన దుస్తులను ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్డుపై ఆర వేసేందుకు వెళ్లిన రంగమ్మ... అక్కడ తెగిపడి ఉన్న వైర్‌ను గమనించి పక్కకు వేసేందుకు చేతిలో తీసుకుంది. అప్పటికే తీగలో విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుమారుడు హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆదమరిస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ!

- సైబర్ నేరగాళ్ల సరికొత్త పంథా
- వేలిముద్రలతో సొమ్ము కాజేస్తున్న వైనం
- ఇప్పటి వరకూ బాధితుల ఖాతా నుంచి రూ.2.16.26.472 అపహరణ
- వేలిముద్రలను రూపకల్పన చేసే సాంకేతికతతో ఖాతాల లూటీ



అనంతపురం: ఆధునాతన టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజల సొమ్మును అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా బ్యాంక్ ఖాతాలను లూటీ చేసేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఈ తరహా నేరాలు పెచ్చుమీరాయి. బ్యాంక్ ఖాతాల్లోని సొమ్ము తమకు తెలియకుండానే మాయమై పోతుండడంతో పలువురు ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పదేపదే జిల్లా పోలీసు యంత్రాంగం హెచ్చరిస్తున్నా... ఎక్కడో ఓ చోట బాధితులు వెలుగులోకి వస్తూనే ఉన్నారు.

సైబర్ నేరాల్లో మచ్చుకు కొన్ని..

- నిరుద్యోగ యువత, అమాయక ప్రజల కష్టార్జితాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చి విదేశాలకు తరలిస్తున్న సైబర్ క్రైం కింగ్‌పిన్ అనయతుల్లా ఖాన్ అలియాస్ ఫర్హాన్‌ను జమ్మూ కాశ్మీర్‌లో గతేడాది డిసెంబర్‌లో అనంత పోలీసులు అరెస్ట్ చేశారు.
- వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారుల పేరుతో ఫేక్‌కాల్, మెసెజ్‌లతో సైబర్ నేరాలకు ఒడిగడుతున్న రాజస్తాన్‌కు చెందిన కీలక నిందితుడు రిజ్వాన్‌ను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు జనవరి రెండో వారంలో అరెస్ట్ చేశారు. మహిళల ఫొటోలను ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకుని వాట్సాప్ చాటింగ్‌ల ద్వారా పరిచయం పెంచుకునే వాడు. ఆ తర్వాత న్యూడ్ వీడియోలు పంపి అవతలి వ్యక్తుల వీడియో ఫొటోలను సేకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ డబ్బు డిమాండ్ చేసేవాడు. ఇదే తరహా కేసులో కొయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మీని పోలీసులు గతంలో అరెస్ట్ చేశారు.
- కొరియర్ సర్వీసు పేరుతో మోసాలకు పాల్పడిన ఇద్దరు ఉత్తరప్రదేశ్ వాసులపై వారం రోజుల క్రితం అనంత పోలీసులు చర్యలు చేపట్టారు.

నకిలీ వేలిముద్రలతో నగదు అపహరణ

ఇటీవల వేలిముద్రల తరహాలోనే నకిలీవి రూపకల్పన చేసి ప్రజల సొమ్మును కాజేస్తున్న సైబర్ నేరగాళ్ల ఆటను అనంతపురం పోలీసులు కట్టడి చేశారు. దేశంలో ఏ మూల దాక్కున్నా వెతికి పట్టుకు వచ్చి ప్రజల సొమ్ము రికవరీ చేసిస్తున్నారు. ఇటీవల బిహార్‌లో మకాం వేసిన సైబర్ నేరగాళ్లను గుర్తించిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో బిహార్‌కు వెళ్లిన అనంత పోలీసులు పలువురిని అరెస్ట్ చేసి, అనంతకు పట్టుకువచ్చారు. వీరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెబ్‌సైట్‌ల ద్వారా డాక్యుమెంట్లలోని వేలిముద్రలు, ఆధార్ కార్డుల నకళ్లను డౌన్‌లోడ్ చేసుకునేవారు. అనంతరం కొన్ని రకాల రసాయనాలు వినియోగించి అసలు వేలిముద్రలను పోలిన నకిలీవి సిద్ధం చేసి, ఆధార్ ఎనబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏపీఈఎస్) ద్వారా డాక్యుమెంట్లలోని వేలిముద్రల సంబంధీకుడి బ్యాంక్ ఖాతా నుంచి నగదు అపహరించేవారు. ఈ ముఠాలో నూర్ ఇస్లాం, మహమ్మద్ ఇస్రాఫిల్ పట్టుబడగా... బబ్బుద్దీన్ పరారీలో ఉన్నాడు. ఈ ముగ్గురూ తాము కాజేసిన సొమ్మును సమానంగా పంచుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మూడు నెలల వ్యవధిలో ఈ ముఠా సభ్యులు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. గత 13 నెలలుగా ఎన్‌సీఆర్‌పీ, 1930 నంబర్లకు జిల్లా నుంచి 1484 ఫిర్యాదులు అందాయి. ప్రజల ఖాతాల నుంచి మొత్తం రూ.2,16,26,472 మాయం చేసినట్లుగా ఫిర్యాదుల ద్వారా వెల్లడవుతోంది. ఇందులో ఇప్పటి వరకూ రూ. 1,50,25,967 నగదును తిరిగి బాధితుల ఖాతాల్లోకి సైబర్ క్రైం పోలీసులు జమ చేయించారు. మిగితా సొమ్ము రికవరీపై దృష్టి సారించారు. ఈ క్రమంలో జమ్మూకాశ్మీర్, తమిళనాడు, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లలో దాక్కున్న సైబర్ నేరగాళ్లను ఇది వరకే అనంత పోలీసులు పట్టుకున్నారు. తాజాగా బిహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడం విశేషం.

అప్రమత్తంగా ఉండాలి

ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, వేలిముద్రలను వివిధ మార్గాల ద్వారా సేకరించి వాటి ఆధారంగా ప్రజల బ్యాంక్‌ల ఖాతా నుంచి డబ్బు దోచేస్తున్న ముఠా చర్యలపై అప్రమత్తంగా ఉండాలి. ఏపీఈఎస్‌పై ప్రజల్లో చైతన్యం అవసరం. వ్యక్తిగత సమాచారంతో పాటు వేలిముద్రలను తరుచుగా సమాచారం నిమిత్తం ఎవరికైనా ఇస్తే బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముంది. గ్రామీణ ప్రాంతాల్లో ఏటీఎం సౌకర్యం లేని ప్రాంతాల్లో ఏఈపీఎస్ విత్ డ్రా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఈ రకంగా నగదును రూ.10 వేల లోపు డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలి.

– కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ

సేవాగఢ్‌లో ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు

గుత్తి రూరల్: ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గుత్తి మండలం చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులు మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సేవాగఢ్‌లోని టీటీడీ కళ్యాణ మంటపం వేదికగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సేవాగఢ్ ట్రస్ట్ అధ్యక్షుడు కొర్రా జగన్నాథ్‌నాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, గుత్తి, గుంతకల్లు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి బంజారాసంఘం ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, 14, 15 తేదీల్లో ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజారవాణా విభాగం అధికారులకు సూచించారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులూ సమీప గ్రామాల్లో నాటుసారా, మద్యం అమ్మకాలు జరగకుండా చూడాలని సెబ్ అధికారులకు సూచించారు. తాగునీటి సౌకర్యం, తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులందరూ మూడు రోజుల పాటు సేవాగఢ్‌లోనే ఉండాలని తీర్మానించారు. సమావేశంలో సర్పంచ్ అప్పా వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు రవీంద్రనాయక్, రామచంద్రనాయక్, సుబ్రహ్మణ్యం నాయక్, సీఐ వెంకట్రామిరెడ్డి, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, డీటీ లలిత, విద్యుత్ ఏఈ శ్రీకుమార్, సీడీపీఓ దిల్లేశ్వరి పాల్గొన్నారు.

13న జీడిపల్లి రిజర్వాయర్ చేపల వేట వేలం

అనంతపురం అగ్రికల్చర్: బెళుగుప్ప మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో చేపల వేట, విక్రయాలపై ఈ నెల 13న ఉదయం 10 గంటలకు బూదిగమ్మ ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, పీఏబీఆర్ ఎఫ్‌డీఓ డి.పెద్దబాబునాయక్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీడిపల్లి, రామసాగరం, అంకంపల్లి, హనిమిరెడ్డిపల్లి, దుద్దేకుంట గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న రిజర్వాయర్‌లో చేపల వేట, విక్రయాలు చేసుకునేందుకు ఆసక్తి, అర్హత ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చు. వేలం దక్కించుకున్న వారికి జూన్ 30వ తేదీ వరకూ చేపల వేటకు అర్హత ఉంటుంది. అత్యధిక మొత్తంలో పాట పాడిన వారు వెంటనే పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం వేలం పాటలో రాకపోతే మరో రోజు వేలం నిర్వహిస్తారు.

కులవృత్తులకు పూర్వ వైభవం

- జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి
- జిల్లాలో 18 రకాల కుల వృత్తుల గుర్తింపు
- వృత్తిదారులందరికీ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం వర్తింపు
- రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి

అనంతపురం సిటీ: అంతరించిపోతున్న కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని సంబంధిత అధికారులను జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఆదేశించారు. అనంతపురంలోని జెడ్పీ కాంపౌండ్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గుర్తించిన 18 రకాల కుల వృత్తిదారులకు ఆర్థికంగా రుణ వసతి కల్పించి, వృత్తులకు తిరిగి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. విశ్వకర్మ పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. ఇందుకు కేవలం 5 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం లబ్ధి చేకూరుస్తామన్నారు. విశ్వకర్మ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసిందని ఎంఎస్ఎంఈపీఐ అసిస్టెంట్ డైరెక్టర్ డీపీఎస్ఆర్ మూర్తి తెలిపారు. 2028వ సంవత్సరం వరకూ ఈ పథకం కొనసాగుతుందని ప్రకటించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం విధి విధానాలను జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు వివరించారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రెండో దశ నుంచి మూడో దశకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. విశ్వకర్మ పథకం కోసం వచ్చే దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించాలని సర్పంచులకు డీపీఓ ప్రభాకర్‌రావు సూచించారు. మహిళలకు నైపుణ్యాలు పెంపొందించి ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ తెలిపారు. దరఖాస్తుకు సంబంధించిన అనుమానాలను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సీఎస్‌సీ జిల్లా మేనేజర్ కృష్ణ సాగర్ తెలిపారు. బ్యాంకర్లు, జిల్లా పరిశ్రమల శాఖ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వత్థం హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి టౌన్: పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థనారాయణస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవారం చేపట్టారు. రూ.10,48,653 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, కమిటీ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు రహదారిలో రాకపోకలు బంద్

అనంతపురం: పంగల్ రోడ్డు – రాప్తాడు మార్గంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ఆ మార్గంలో బుధ, గురువారం వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రజలు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని కోరారు. కదిరి రోడ్డు నుంచి పంగల్ రోడ్డు, రాప్తాడు మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకునే వాహనాలు ఇకపై అనంతపురం నగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాద్ నుంచి రాప్తాడు, పంగల్ రోడ్డు మీదుగా కదిరికి వెళ్లే వాహనాలు అనంతపురం ద్వారా పంగల్ రోడ్డు, కదిరి వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. భారీ వాహనాలు అనంతపురం నగరంలోకి అనుమతించబడవన్నారు. ప్రత్యామ్నాయంగా కదిరి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న చెరువుకట్ట పైనుంచి ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు మీదుగా సోములదొడ్డి వద్ద 44వ జాతీయ రహదారిపైకి చేరుకునేలా మళ్లించినట్లు వివరించారు. హైదరాబాద్ నుంచి కదిరి, చెన్నై వైపు వెళ్లే భారీ వాహనాలు సోములదొడ్డి, గుత్తి రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్, చెరువు కట్ట, కలెక్టరేట్, పంగల్‌రోడ్డు, ఆకుతోటపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు.

బస్సు రూట్ల మళ్లింపు

అనంతపురం సెంట్రల్: రాప్తాడు రైల్వే గేటు వద్ద రోడ్డు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల రూట్లను మళ్లించినట్లు జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాప్తాడు మీదుగా వెళ్లే బస్సు సర్వీసులు (బెంగళూరు, పెనుకొండ, మడకశిర, హిందూపురం, బండమీదపల్లి) టవర్‌క్లాక్ మీదుగా 44వ జాతీయ రహదారి వైపు మళ్లించారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని డీపీటీఓ కోరారు.

వ్యవసాయాధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీ విడుదల చేస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ (ప్లాంట్ డాక్టర్ డైరీ), క్యాలెండర్‌ను కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మంగళవారం విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్, జేసీ చాంబర్లలో వేర్వేరుగా జరిగిన ఈ ప్రక్రియలో వ్యవసాయాధికారుల సంఘం నాయకులు ఎం.వెంకటరాముడు, యల్లప్ప, వెంకటకుమార్, సోమశేఖర్, శ్యాంసుందరరెడ్డి, రాకేష్‌నాయక్, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సక్రమంగా అమలు చేసి రైతుల కష్టనష్టాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

గుత్తి సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి దీన

గుత్తి: స్థానిక స్పెషల్ సబ్‌జైలును జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి దీన సందర్శించారు. మంగళవారం సబ్‌జైలుకు చేరుకున్న ఆమె అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలు, బాల నేరస్తులు ఎందరున్నారనే అంశంపై ఆరా తీశారు. ఖైదీలతో మాట్లాడుతూ... జైలులోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, లీగల్ కౌన్సిలర్ సూర్యనారాయణ, పారా లీగల్ వలంటీర్ నరసింహనాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య
- ఈ నెల 29 లోపు పాత లైసెన్సుల రెన్యువల్



మాట్లాడుతున్న లక్ష్మీనరసయ్య, హాజరైన అధికారులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు

అనంతపురం సిటీ: వాణిజ్య విధానాన్ని సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉమ్మడి జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ విధానం అమలులో భాగంగా దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన వారు ఈ నెల 29వ తేదీలోపు రెన్యువల్ చేసుకోవాలని, అనుమతి పొందని వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణ లైసెన్స్‌ల అంశంపై అధికారులు, వ్యాపార సంస్థల అసోసియేషన్ల ప్రతినిధులతో మంగళవారం అనంతపురంలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థల వారు తప్పనిసరిగా తమ సంస్థలను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. గతంలో మ్యాన్యువల్ విధానం కొనసాగేదని, ప్రస్తుతం మీ–సేవా కేంద్రాలు, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, సర్టిఫికెట్లు పొందాల్సిందేనని పేర్కొన్నారు. ఇది వరకే రిజిస్ట్రేషన్ చేయించిన వారు వాటిని రెన్యువల్ చేసుకుని సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ అధికారులు ఎం.సుజాత, రాధా రమాదేవి, జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్, చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రంగారెడ్డి, మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరత్నమయ్య, క్లాత్ అసోసియేషన్ అధ్యక్షుడు హితేన్ జైన్, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావాలి

- రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ



మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ

అనంతపురం మెడికల్: ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేయడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని ఆశ కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ సూచించారు. 'ఆశ డే'పై మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో ఆశ వర్కర్లు మమేకమైనప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలకు అందించే సేవలపై ఎప్పటికప్పుడు చైతన్య పరచాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకునేలా చూడాలన్నారు. ఆశ అజెండా, సేవలను డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి వివరించారు. ఆశ యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.... హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ, ఈసీ కపుల్, ఐఎఫ్ఏ సిరప్, విటమిన్ ఏ సేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలపై డీఎల్‌టీసీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా ఇవ్వాల్సిన పంట రుణాలపై జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశంలో చర్చించారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) హాలులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, ఎల్‌డీఎం సత్యరాజు, నాబార్డు డీడీఎం అనురాధ, సీఈఓ ఏబీ రామ్ ప్రసాద్, బ్యాంకర్లు పాల్గొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా రైతులకు ఏ మేరకు పంట రుణాలు ఇవ్వాలనే అంశంపై సుదీర్ఘ చర్చ కొనసాగింది. పంటల వారీగా గరిష్ట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై రాష్ట్ర కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి ప్రతిపాదనలు పంపనున్నారు. రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలిపారు.

'ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం'

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా దక్కుతుందని పీసీసీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజనకు అంగీకారం తెలుపుతూ నాడు అన్ని రాజకీయ పార్టీలు ఏకమై కేంద్రానికి లేఖ ఇచ్చాయని గుర్తు చేశారు. దీంతో విభజన అనంతరం ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా పార్లమెంట్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే అంశాన్ని పూర్తిగా మరుగున పడేసిందన్నారు. సమావేశంలో ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన అశ్వత్థనారాయణ, వాసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

60 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

శింగనమల: మండలంలోని తరిమెలలో అక్రమంగా నిల్వ చేసిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన సాకే రామయ్య... ప్రజల వద్ద నుంచి రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా మరో ప్రాంతానికి తరలించేందుకు ఇంట్లోనే నిల్వ చేసి ఉంచాడు. అందిన పక్కా సమాచారం మేరకు మంగళవారం విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, సీఎస్‌డీటీ రాజశేఖర్, ఏఈఈ టి.రాజశేఖర్ ఆకస్మిక తనిఖీ చేపట్టి, 60 క్వింటాళ్ల రేషన్ స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వ చేసిన రామయ్యపై కేసు నమోదు చేశారు.

76 పట్టు చీరల సీజ్

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్‌ను దాటుకుని జిల్లాలోకి తీసుకువస్తున్న 70 పట్టు చీరలను సేల్స్ ట్యాక్స్ అధికారులు సీజ్ చేశారు. సేల్స్ ట్యాక్స్ అధికారులు కొడికొండ చెక్‌పోస్టులో మంగళవారం ఉదయం సాధారణ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బెంగళూరు నుంచి గద్వాల్‌కు పట్టు చీరలు తరలిస్తున్న విషయం గుర్తించారు. చీరలు తరలిస్తున్న ఇద్దరి వద్ద ఎలాంటి బిల్లులు, జీఎస్టీ చెల్లింపులకు సంబంధించిన రసీదులు లేవు. దీంతో రూ.5.90 లక్షల విలువ చేసే చీరలను సీజ్ చేశారు.

క్లుప్తంగా

కార్తికేయుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా బంగారు కవచం, పట్టు వస్త్రాలతో అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నిజరూపపాద స్పర్శ దర్శనం


రుక్మిణీ పాండురంగస్వామి నిజరూప పాద దర్శనంలో భక్తులు

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠలస్వామి ఆలయంలో మంగళవారం నిజరూప పాదదర్శన పూజలు జరిగాయి. విజయ ఏకాదశి సందర్భంగా జరిగిన పాదదర్శనానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్, నగేష్ మాట్లాడుతూ ప్రతి ఏకాదశి రోజున స్వామికి నిజరూప పాద స్పర్శ సేవలు జరుగుతాయన్నారు. అంతకు ముందు ఆలయంలో అర్చనలు, పుష్పాలంకార సేవలు జరిగాయి.

చిన్నారులకు ఆధార్ చేయించాలి



చిన్నారికి ఆధార్ అక్నాలెడ్జ్‌మెంట్‌ను అందజేస్తున్న కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: చిన్నారులకు ఆధార్ చేయించాలని నగర కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. మంగళవారం నగరంలోని 50వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ మేళాను కమిషనర్ మేఘ స్వరూప్ పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఆధార్ సెంటర్లు లేని ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఆధార్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆధార్ నమోదు చేసుకున్న చిన్నారికి కమిషనర్ అక్నాలెడ్జ్‌మెంట్ అందించారు. అనంతరం ఆ డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలలో కమిషనర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురు శేఖర్‌బాబు, మాజీ కార్పొరేటర్ గురు బిందుప్రియ, హెచ్‌ఎం మారుతీలత, ఆపరేటర్లు అరుణ, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు రాఘవేంద్రరావుకు అభినందనలు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంత జిల్లాకు విశేష సాహితీ సేవలందించిన సీనియర్ రచయిత కల్లూరు రాఘవేంద్రరావు హిందూపురం నియోజకవర్గ జిరసం అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై అనంత రచయితలు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సాహిత్యభారతి గౌరవాధ్యక్షుడు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు , డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షుడు రియాజుద్దీన్ తదితరులు అభినందించారు.

జాతీయ పురస్కారానికి దేవరకొండ కౌసల్య ఎంపిక



అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త దేవరకొండ కౌసల్య మరో జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు సంస్కృతీ సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు, వేమన జయంతి ఉత్సవాల సందర్భంగా పలువురు సాహితీ, ఆధ్యాత్మిక, సామాజిక సేవకులకు జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. ఆమె ఈనెల 11న విజయవాడలో జరగనున్న పురస్కార ప్రదానోత్సవంలో ఆధ్యాత్మిక వేత్తలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటారు. కౌసల్యను చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతీ, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధి కేవీఎస్ చలపతిరెడ్డి అభినందించారు.

జీఓలు విడుదల చేయాలి

అనంతపురం అర్బన్: సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి జీవోలను విడుదల చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, నాయకులు వెంకటనారాయణ మాట్లాడారు. సమ్మె ముగింపు రోజున మంత్రులు ప్రకటించారన్నారు. అయితే కొన్నింటికి మాత్రమే జీవోలు ఇచ్చాన్నారు. మిగిలిన జీవోలనూ విడుదల చేయాలన్నారు. నాయకులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, పోతులయ్య, నల్లప్ప, నాగరాజు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

‘సిద్ధం’ సభ విజయవంతం చేయాలి


రాప్తాడు వద్ద సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: ఈ నెల 11న రాప్తాడు ఆటోనగర్ సమీపంలో నిర్వహించనున్న ఎన్నికల శంఖారావం సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ఆయన కుమారుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కోరారు. వైఎస్సార్ కడప జిల్లా , చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల వైఎస్సార్ సీపీ సన్నాహక సభ ‘సిద్ధం’ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఆటోనగర్ సమీపంలోని స్థలాన్ని చదును చేయడం, టెంట్లు, సభాస్థలి, వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కుట్ర రాజకీయాలకు తెరలేపాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై వారి అనుకూల పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వీరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా విద్యా, వైద్యం, ఇళ్ల స్థలాల పంపిణీ, పెన్షన్స్ దేశానికే తలమానికమన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైనాట్ 175 లక్ష్య సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ యర్రగుంట జనార్దన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు రాప్తాడు విద్యార్థినుల ఎంపిక


జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాప్తాడు: జాతీయ స్థాయి పురుషులు, మహిళల త్రోబాల్ పోటీలకు రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీలు బి.రాజశేఖర్ రెడ్డి, ఎస్.కేశవమూర్తి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థినులు అంజలి, భవిత, నవ్యశ్రీ జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హెచ్‌ఎం నరసింహులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు చిట్రా ఆదినారాయణ, తరుణ్, ఓబులేష్, చైతన్య, నాగేష్, విద్యార్థులు అభినందించారు.

ఆత్మకూరు తహసీల్దార్‌గా పరమేశ్వరస్వామి


నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ హేమలత, నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన తహసీల్దార్‌గా పరమేశ్వర స్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆత్మకూరు తహసీల్దార్‌గా ఉన్న షరిఫ్‌మల బదిలీపై కర్నూలుకు వెళ్లడంతో తిరుపతి జిల్లా పుత్తూరులో ఉన్న పరమేశ్వరస్వామిని ఆత్మకూరుకు నియమించారు. తహసీల్దార్‌కు ఎంపీపీ హేమలత ,జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

ఘనంగా కుంటెమ్మ తల్లికి బోనాలు


కుంటెమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వెలసిన శ్రీకుంటెమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకార సేవల్లో అమ్మవారిని భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన వితరణ జరిగింది. సాయంత్రం వరకు జరిగిన ప్రత్యేక పూజలు, భజనల్లో కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు శేఖర్‌బాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రత్నబాయి


మందులను ఇస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామరక్ష అని, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రత్నబాయి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో వైద్యరంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు తెలిపారు. మొదటి విడతలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాయని, ఇంకా వైద్య సేవలు అందరి వారి కోసం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డి నరసింహారెడ్డి, వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ, సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముట్టాలలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముట్టాల, పాపంపల్లి, గొరిదిండ్ల, గొరిదిండ్ల తండా గ్రామాల ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. మందులు ఇచ్చినట్లు డాక్టర్ సబిహా సుల్తానా తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి, లోపాలున్న వారికి కళ్లద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పక్కాగా చేపట్టాలి


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: పేదలందరికీ ఇళ్లు జగనన్న శాశ్వత స్థల హక్కు పథకం లబ్ధిదారుల ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలని అదనపు కమిషనర్ శ్రీహరి బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని 15 సచివాలయాలను అదనపు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను ఏవిధంగా అనుసరించాలని అడ్మిన్, వీఆర్‌ఓలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే నెంబర్‌తో పాటు లబ్ధిదారుని పేర్లు, హద్దులను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన పూర్తీ బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

ఉత్సాహంగా పెద్దమ్మతల్లి ఊరుదేవర


ఊరుదేవర సందర్భంగా ప్రత్యేకంగా అలంకరణలో గ్రామదేవత


తూంచర్ల ఊరుదేవరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో మంగళవారం పెద్దమ్మస్వామి ఊరుదేవర నిర్వహించారు. గ్రామంలోని పెదమ్మ, నల్లలమ్మ గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే అమ్మవార్లకు బలితర్పణం చేసి, గ్రామంలోని పొలి వేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊర దేవరకు హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు: తూంచర్లలో ఊరు దేవర సందర్భంగా ఏర్పాటు చేసిన విందుకు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ బోయ శాంతమ్మ, నియోజకవర్గ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారు గ్రామ దేవతలను దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందురెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కడపకు వెళ్లి పింఛన్ అందజేత


కడప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వరలక్ష్మి

రామగిరి: మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే దివ్యాంగుడికి వలంటీర్ వరలక్ష్మి కడపకు వెళ్లి పింఛన్ అందించింది. 60 ఏళ్లుపైబడిన దివ్యాంగుడు వెంకటరెడ్డి కొన్నిరోజులుగా కడపలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

9న అశ్వత్థంలో వేలం

తాడిపత్రిటౌన్: ఈనెల 9న పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో మాఘమాసం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లడ్డూ విక్రయాలకు వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు మంగళవారం ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 9959861168 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై దిల్కా శీనా పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గార్లదిన్నెకు చెందిన రాముడు పని మీద బైక్‌పైగుత్తికి వచ్చాడు. తిరిగి బైక్‌లో స్వగ్రామానికి వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు.

రామగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



రామగిరి: రామగిరి మండల ఎస్ఐగా బీటీ వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ జనార్ధన్‌నాయుడు పుట్టపర్తికి బదిలీ అయ్యారు. దీంతో అమరాపురంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఐకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మౌలిక వసతులు తప్పనిసరి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి

కూడేరు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని రెవెన్యూ, పోలీసు సిబ్బందికి డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న గదులు, పరిసరాలను పరిశీలించారు. వెలుతురు, నీటి వసతి, దివ్యాంగులకు ర్యాంప్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సీఐ శివరాముడు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల పాటు ఉండే ధర్మకర్తల నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల లోపు దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఆలూరు కోనరంగస్వామి ఆలయానికి..

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాయకుల స్వామి ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజులు లోపు కర్నూలులోని దేవదాయ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాడు-నేడు, అమ్మఒడిపై అవగాహన

అనంతపురం కార్పొరేషన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ‘నాడు-నేడు’, అమ్మఒడి పథకం ప్రాముఖ్యతపై వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ వింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేరళ కంటే దీటుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా రూ.16 వేల కోట్లతో అభివృద్ధి చేసిందన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం చేసిన ఖర్చును విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ నాయకులు శ్యాంసుందర్, మురళీకృష్ణ, కేదార్‌నాథ్, ఉపాధ్యాయులు ఫయాజ్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు కొటేషన్ల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ పనులకు కొటేషన్లు అందజేయాలని ఆలయ ఈఓ క్రిష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, సున్నపు పూతలు, షామియానాలు, పూల డెకరేషన్, అన్నదానానికి కిరాణా సరుకుల సరఫరా, వంట మాస్టర్, కూరగాయల సరఫరా తదితర పనుల నిర్వహణకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 16లోగా కొటేషన్లు అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు అనేక అంశాలపై నైపుణ్యం పెంపొందించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ శ్రావణ, ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ సెబీ, ఎస్ఎస్ఈ సూచనల మేరకు ప్రజలు డబ్బును నాన్ బ్యాంక్ సంస్థల్లో పెట్టుబడి పెట్టడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షేర్లు, స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి పెట్టుబడి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, డిజిటల్ పద్ధతుల ద్వారా లావాదేవీలు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఏపీఎస్ఎస్‌డీసీ కళాశాల కోఆర్డినేటర్ బాలగంగాధర్, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ఐదో తరగతి, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం(2024- 25) ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు, ఇంటర్‌లో ప్రవేశానికి ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23లోపు https://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీనివాస ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

అనంతపురం మెడికల్: నగరంలోని సూర్యనగర్ ఐరన్ బ్రిడ్జి సమీపంలోని శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ సేవలు పునఃప్రారంభించినట్లు ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ ఎ.రాఘవేంద్ర, డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక పరికరాలతో స్పెషాలిటీ శస్త్రచికిత్సలు, వైద్యసేవలను అందిస్తామని యాజమాన్యం తెలియజేసింది.

అవయవదానం గొప్పది


మాట్లాడుతున్న డాక్టర్ సీతా మహాలక్ష్మి

అనంతపురం: అన్ని దానాల్లో కెల్లా అవయవదానం గొప్పదని అఖిల భారత శరీర అవయ దాన సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతా మహాలక్ష్మి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో అవయవదాన అవగాహన సదస్సు నిర్వహించారు. అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.మురళీధర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్య సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పామిడి: స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం షట్ తిల ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

మత సామరస్యానికి ప్రతీక మసూద్ గాజి దర్గా

- నేటి నుంచి ఉరుసు
- ఏర్పాట్లలో నిమగ్నమైన దర్గా కమిటీ సభ్యులు


మసూద్ గాజి సమాధి

శింగనమల: మండల కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ సాలర్ మసూద్ గాజి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మతాలకు అతీతంగా భక్తులు దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేస్తారు. ఇంతటి ప్రత్యేక సంతరించుకున్న దర్గాలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఉరుసు నిర్వహించనున్నారు. ఈమేరకు దర్గా ముతవల్లి అబ్దుల్ రవూఫ్, దర్గా ముజావర్లు రజాక్ అహమ్మద్, గ్రామ సర్పంచ్ నాగమునెమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మసూద్ గాజి దర్గా ప్రత్యేకత

శింగనమలలో హిందూ-ముస్లింలు కలిసి జరుపుకునే అతి పెద్ద పండుగ మసూద్ గాజి ఉరుసు. శింగనమలలో ప్రతి ఇంట ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారు. ఏఇంట శుభకార్యం జరగాలన్న మొదట దర్గాకు వెళ్లి చక్కెర చదివింపులు చేయించుకుంటంఆరు. ఆదేవిధంగా పాటు ప్రతి గురువారం భక్తులు దర్గాకు వచ్చి చక్కెర చదివింపులు చేయించడం ఆనవాయితీ.

వేడుకగా గంధం

బుధవారం నుంచి నుంచి ఈ 9 వతేది వరకు ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నారు. తొలిరోజు గంధం, అదేరోజు రాత్రి 8 గంటల నుంచి భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. అదే రోజురాత్రి 9.30 నుంచి 1 గంట వరకు దర్గాలో పూల చాందిని తయారు చేస్తారు. పూలచాందినిని అలంకరించిన తరువాత తెల్లవారుజామున 1.30 గంటలకు పూల చాందిని(గంధం)ని పురవీధుల్లో ఊరేగిస్తారు. పక్కీర్ల జల్సాలు, కర్రసాము విన్యాసాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు సాగుతుంది. 8వ తేది ఉదయం 6 గంటలకు పూల చాందిని దర్గాకు చేరుకుంటుంది. అక్కడ చదివింపులు తరువాత, భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. గురువారం ఉరుసు మహోత్సవం నిర్వహిస్తారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు. కందూరోత్సవం లాంటివి భక్తులు చేపడుతారు. ఆదే రోజు మధ్యాహ్నం ఇరుసు పందెం నిర్వహిస్తున్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందించనున్నారు. రాత్రి ఖవ్వాలీ నిర్వహిస్తారు. 9న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం జియారత్ ఫాతెహా జరుగుతుంది. రాత్రి 10 గంటలకు క్రేజీ బాయ్స్ ఆర్కెస్ట్రా తెలుగు, హింది పాటల కచేరీ నిర్వహిస్తారు.